www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 11 నవంబర్ 2025

5

వైఎస్ఆర్

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం : జెసి

ప్రజాశక్తి - కడప : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు ప్రజలు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవన్ సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జెసితోపాటు డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. కింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు.

తెలుగు దీపానికి శాశ్వత వెలుగునిచ్చిన

మహనీయుడు సిపిబ్రౌన్ : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగు భాషా సాహిత్యాలు తాళపత్రాల్లో అగ్గిపురుగులకు అహుతవుతున్న సందర్భంలో తెలుగు దీపానికి శాశ్వత వెలుగునిచ్చిన మహనీయుడు సిపిబ్రౌన్ అని, తెలుగు భాషా సాహిత్యాలకు ఎనలేని సేవ చేసిన సి.పి.బ్రౌన్ జయంతిని ప్రభుత్వం రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించడం హర్షణీయమని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నారు. వైవీయూ ఆధ్వర్యంలోని సోమవారం 'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ 227వ జయంతిని నిర్వహించారు. ముందుగా రాజీవ్ మార్గ్‌లోని బ్రౌన్ విగ్రహానికి, సమావేశమందిరంలోని సి.పి.బ్రౌన్ చిత్రపటానికి అతిథులతో కలసి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అని అన్నారు. సుమారు 15 మంది పండితులను పోషించి కడప గడపలో ఆయన సాహిత్య యజ్ఞాన్ని నిర్వహించారన్నారు. బ్రౌన్ నివసించిన బంగ్లళా శిథిలాలను డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి స్థలదాత సి.కె.సంపత్ కుమార్, జి.కృష్ణమూర్తి, జె.సి.సుబ్బయ్య, ఎన్.సి.రామసుబ్బారెడ్డి, కట్టా నరసింహులు లాంటి ప్రముఖులతో కలసి సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయమనే జ్ఞానసౌధాన్ని నిర్మించి చిరకీర్తుల య్యారన్నారు. విశిష్ట అతిథి, యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యాల కోసం తన జీతాన్ని, జీవితాన్ని త్యాగం చేసిన త్యాగమూర్తి సి.పి.బ్రౌన్ అని అన్నారు. ఒక విదేశీయుడి జయంతిని తెలుగు ప్రజలు ఆనందంతో నిర్వహించడం బ్రౌన్ కృషికి, ఆయన పట్ల ప్రజలకున్న కృతజ్ఞతకు తార్కాణమన్నారు. సభాధ్యక్షులు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ డేవిడ్ బ్రౌన్, కౌలే దంపతులకు రెండవ సంతానంగా సి.పి.బ్రౌన్ జన్మించారన్నారు. మద్రాసులో శిక్షణలో ఉన్నప్పుడు తొలిసారిగా వెలగపూడి కోదండరామయ్య పంతులు దగ్గర తెలుగు నేర్చుకున్నారన్నారు. తాళపత్రాల్లో ఉన్న వేమన పద్యాలను సేకరించి, 'వర్సెస్ ఆఫ్ వేమన' అనే పేరుతో ఆంగ్లంలోకి అనువదించి విశ్వకవిని చేశారన్నారు. అతిథులను సాహితీవేత్త ఎస్.ఆర్.ప్రతాప రెడ్డిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి సభా సమన్వయం చేశారు. జానమద్ది విజయభాస్కర్, విజయలక్ష్మి దంపతులు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి శతజయంతిని పురస్కరించుకుని విశ్వవిద్యాలయ అధికారులను, బ్రౌన్ గ్రంథాలయ సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో తెలుగుశాఖ ఆచార్యులు ఎన్.ఈశ్వరరెడ్డి, ఎం.ఎం.వినోదిని, పి.రమాదేవి, పుత్తా పుల్లారెడ్డి, డాక్టర్ పుత్తా బాలిరెడ్డి, తెలుగు పరిశోధక విద్యార్థులు, బ్రౌన్ గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, నాగరాజు, ఎస్‌కెఆర్ %డ% ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, గానుగపెంట హనుమంతరావు, ఐజాక్, కొండూరు జనార్దన రాజు, కొత్తపల్లి రామాంజనేయులు, రాయల్ రషీద్ పాల్గొన్నారు.

ఆఫీసర్స్‌క్లబ్‌లో.. సిపి బ్రౌన్ 227వ జయంతి వేడుకలు కడప ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా రెవెన్యూ విభాగ అధికారి ఎం.విశ్వేశ్వర నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రౌన్ సాహితీ సేవను, ఉద్యోగవిధులను కొనియాడుతూ బ్రౌన్ కడపలో నివసించడం గర్వకారణమని. అతని పేరున జానమద్ది హనుమత్ శాస్త్రి గ్రంథాలయం నెలకొల్పడం ముదావహం అన్నారు.

బ్రౌన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విసి రాజేశ్ఖర్, సాహితీ ప్రియులు

శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని

అనుమానాస్పద మృతి

- పాఠశాల వారే చంపారంటూ తల్లిదండ్రుల ఆరోపణ
- ఆందోళనను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలో ఉన్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతిచెంది. వివరాలు.. తొండూరు మండలం పాలూరు గ్రామానికి చెందిన కల్లూరు రవిశంకర్‌రెడ్డి కుమార్తె కల్లూరి జస్వంతి చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలోనే హాస్టల్‌లోనే ఉంటూ 9వ తరగతి చదువుతోంది. రోజుమాదిరిగానే ఆమె సోమవారం ఉదయం స్టడీ అవర్‌లో ఉండి 6.30 గంటలకు తన హాస్టల్ రూమ్‌కు వెళ్లి గడియ పెట్టుకుంది. ఉదయం 6.50 అయినప్పటికీ జస్వంతి బయటకు రాకపోవడంతో తోటి విద్యార్థి తలుపు తీసేందుకు యత్నించింది, ఎంతకూ తెరుచుకోకపోవడంతో కిటికిలో నుంచి చూసింది. అప్పటికే రూములో ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ జస్వంతి కన్పించడంతో విద్యార్థి వెంటనే కేర్‌టేకర్‌కు చెప్పింది. హుటాహుటీనా వచ్చి తలుపులను బలంగా తన్ని ఫ్యాన్‌కు వేలాడుతున్న జస్వంతిని కిందికి దించి వెంటనే ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయిందని చెప్పారు. పాఠశాల యాజమన్యాం అక్కడి నుంచి మార్చురికీ తరలించి విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు.

మృతదేహంతో ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

మృతిచెందిన విద్యార్థి జస్వంతి (ఇన్‌సెట్‌లో ఫైల్‌ఫొటో)

రిమ్స్ వద్ద ఉద్రిక్తత..మృతదేహంతో ర్యాలీ

విద్యార్థి జస్వంతి ఆత్మహత్యపై ఆమె తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల యాజమాన్యమే తమ బిడ్డను చంపిందంటూ తండ్రి రవిశంకర్‌రెడ్డి ఆరోపించారు. విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు రిమ్స్ మార్చురీ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి జస్వంతి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు, బంధువులు స్ట్రెక్చర్‌పై మోసుకుని రిమ్స్ మెయిన్ గేట్ల వద్దకు వచ్చారు. అక్కడ పోలీసులు కాసేకు గేట్లు వేయడంతో వాటిని తొలగించుకుని మెయిన్ రోడ్డుపై ర్యాలీగా వస్తుండగా మార్గ మధ్యలో పోలీసులు అడ్డుకుని వారిని నచ్చజెప్పి తిరిగి మృతదేహాన్ని మార్చురీకి తిరిగి పంపారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సిఐ బాల మద్దిలేటి తెలిపారు. పాఠశాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి : ఎస్ఎఫ్ఐ

కడప అర్బన్ : విద్యార్థిని మృతికి కారకులైన పాఠశాల యాజమాన్యంపై శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి పేర్కొన్నారు. విద్యార్థి చనిపోయిన విషయాన్ని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. విద్యార్థిని మరణానికి చైతన్య విద్యాసంస్థలం యజమాన్యం కారణమని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అసలైన దోషులను పట్టుకుని వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

గంగిరెద్దుకు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

చెర్లోపల్లికి దారి ఏర్పాటు చేయాలని గంగిరెద్దుకు వినతి

ప్రజాశక్తి- కడప అర్బన్

జిల్లా అధికార యంత్రాంగం ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరుతో కాలయాపన చేస్తున్నారే తప్ప నిజంగా సమస్యలు పరిష్కరించడం లేదని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ తీవ్రంగా విమర్శించారు. ఎనిమిది నెలలుగా చెర్లోపల్లి లేఅవుట్ లో రహదారి సమస్యను పరిష్కారం చేయాలని అనేక రూపాల్లో అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ఇప్పటివరకు స్పందించలేదన్నారు. దీన్ని నిరసిస్తూ సోమవారం నగరంలోని బాలాజీ నగర్‌లో గంగిరెద్దుకు వినతిపత్రం సమర్పించి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ కడప శివారు ప్రాంతంలో ఉన్న చెర్లోపల్లి లే అవుట్ పరిధిలో ప్రజలు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రధానంగా లేఅవుట్‌కు తూర్పు వైపున ఉన్న 500 కుటుంబాల దగ్గరికి వెళ్లడానికి దారి సౌకర్యం ఏర్పాటు చేయలేదన్నారు. ఈ దారి ఏర్పాటు చేయాలని అధికారుల చుట్టూ అనేక సార్లు తిరిగినా ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికార యంత్రాంగం ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరుతో ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని, సమయాన్ని కాలయాపన చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. అటు కార్పొరేషన్, ఇటు రెవెన్యూ, ఇంకోవైపు హౌసింగ్ అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పి సమస్యను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి తక్షణమే రహదారిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనేకసార్లు విజ్ఞప్తి చేసిన పరిష్కారానికి ప్రయత్నం చేస్తున్నామని మాటలు చెబుతున్నారు తప్ప చిత్తశుద్ధి లేదన్నారు. సమస్యను ఇదే పద్ధతిలో నిర్లక్ష్యం చేస్తూ పోతే రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయడానికి శ్రీకారం చుడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరి రెడ్డి, నగర కమిటి సభ్యులు చంద్రారెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, నరసింహ, విజయ్, రవి, శ్రీనువాసులురెడ్డి పాల్గొన్నారు.

'పద్మావతి' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : పది పదిహేను సంవత్సరాలగా రిమ్స్ జిజిహెచ్‌లో పనిచేస్తున్న శానిటేషన్ సూపర్‌వైజర్లను అకారణంగా తొలగించడం అన్యాయమని, వారిని వెంటనే విధులకు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, మనోహర్, ఆప్కాస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఆప్కాస్ జిల్లా అధ్యక్షులు పవన్, శానిటేషన్ సూపర్‌వైజర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా జిల్లాలో 15 ఏళ్లుగా పనిచేస్తున్న వారిని తొలగించడం సరైంది కాదన్నారు.చదువు పేరుతో తొలగిస్తామని మౌఖికంగా ఆదేశాలు ఇవ్వడం సరైనది కాదన్నారు. కాంట్రాక్టర్, వర్కర్లను బెదిరించడం దుర్మార్గమని తెలిపారు. తొలగించిన కార్మికులను విధులకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాల కార్మికులను తీసేస్తామని భయాందోళన సృష్టించడం సరైంది కాదని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని కాంట్రాక్టర్ పైన చర్యలు తీసుకోవాలన్నారు. లేబర్ యాక్ట్‌కు భిన్నంగా వ్యవహరిస్తున్న యాజమాన్యంపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. పద్మావతి హాస్పిటల్ మేనేజ్మెంట్ సర్వీస్ ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. విధులకు తీసుకోకపోతే సమ్మెలకు వెళ్తామని తెలిపారు.

రక్తహీనతను నివారించండి

ప్రజాశక్తి - గోపవరం : బద్వేల్ మండలం తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ జి. రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు పోషకాహారం తీసుకోవడం, ఎఎన్ఎంలు ఇచ్చే ఐరన్ మాత్రలు వాడడం ద్వారా రక్తహీనతను నివారించుకోవాలని సూచించారు. చిన్న ఆరోగ్య సమస్యలు వచ్చినా 108 వాహన సేవలు వినియోగించి ఆస్పత్రికి రావాలన్నారు. అనంతరం బి. వెంగయ్య మాట్లాడుతూ లింగ నిర్ధారణ నేరమని, ఆడపిల్లను పుట్టిద్దాం, రక్షిద్దాం, చదివిద్దాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : రాష్ట్ర స్థాయి ఖోఖో క్రీడలు ఆడేందుకు విద్యార్థి యువరాజ్ ఎంపికైనట్లు అంగడివీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తమ పాఠశాలలో 8వ తరగతి చదువతున్న యువరాజ్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడని పేర్కొన్నారు. ఈనెల 8న కడప మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ స్కూల్‌లో నిర్వహించిన పోటీలలో విద్యార్థి ప్రతిభ కనబరిచారన్నారు. ఈనెల 22 నుండి 24 వరకు కాకినాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొం టారన్నారు. ఎంపికైనందుకు విద్యార్థిని వ్యాయామ ఉపాధ్యాయుడు అగ్గిరప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

విద్యుత్ ప్రయివేటీకరణను వ్యతిరేకిద్దాం

- కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి
- యుఇఇయు డిస్కం అధ్యక్షులు శివశంకర్

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం విద్యుత్ (సవరణ) - 2025 బిల్లును తీసుకువచ్చి డిస్కంలను ప్రయివేటీకరణ చేయాలని ప్రయత్నంచేస్తుందని, అందరూ వ్యతిరేకించాలని యుఇఇయు డిస్కం అధ్యక్షులు శివశంకర్ పిలుపునిచ్చారు. సోమవారం ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ప్రధానంగా కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను సంస్థలో విలీనంచేసి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేడ్ టు జెఎల్ఎంలకు, కారుణ్య నియామకాల్లో ఎపిఎస్ఇబి సర్వీస్రూల్స్ వర్తింపజేయాలని పేర్కొన్నారు. పీస్ట్ వర్కర్లకు ఉద్యోగభద్రత, కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాల్లో నియమించిన వారికి రెగ్యులర్ వారికిచ్చిన వేతనాలు కాకుండా తక్కువ వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టు వర్కర్లకు రూ. 10లక్షల గ్రాట్యూటీ, కోటి రూపాయల ఇన్సూరెన్స్ కల్పించాలని చెప్పారు. జెఇ, జెఎ, కన్వర్షన్స్ వేతనాలలో వ్యత్యాసం నివారించాలని, వన్ ఇండస్ట్రీ వన్ సర్వీస్ రెగ్యులేషన్స్ పాటించాలని, పాత పెన్షన్ అమలు చేయాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ కోరిందని పేర్కొన్నారు. ప్రధాన సమస్యలన్నింటినీ పరిష్కరించకుండా విద్యుత్ యాజమాన్యం, రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. సమస్యలు పరిష్కరించేదాక మనపోరాటాన్ని కొనసాగిస్తూనే విద్యుత్ రంగ ప్రయివేటీకరణ విధానాలను ఎదుర్కోవల్సి ఉందని చెప్పారు. ఇప్పటికైనా కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఆలోచించాలని సూచించారు. ఈ నెల 20న చలో విజయవాడ కార్యక్రమాన్ని కార్మిక, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, పీస్ రేట్ వర్కర్లు అందరం పాల్గొని, సంస్థ ను ,మన హక్కులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. విద్యుత్ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని హెచ్చరించారు. మన సంస్థ మనుగడను కాపాడుకోవటానికి మనమందరం ఐక్యంగా ఉద్యమించాలని పేర్కొన్నారు.

రక్తదానం చేస్తున్న యువత

పాలిటెక్నిక్ కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- కడప అర్బన్

మౌలానా ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో కడప, ఖున్ కా రిష్తా ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యులు డాక్టర్ షేక్. రబ్బానీ బాష (లైఫ్ లైన్ హాస్పిటల్) హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. రక్తదానం చేయడం ద్వారా వారు సమాజానికి తమ వంతు సహాయాన్ని అందిస్తూ మానవత్వాన్ని ప్రదర్శించారని తెలిపారు. రక్తదాన ప్రాముఖ్యతను వివరించారు. రక్తదానం పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడుతుందని పేర్కొన్నారు. ఇది సమాజానికి అందించే అత్యంత విలువైన సేవని చెప్పారు. ఖున్ కా రిష్తా ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యం.తారిక్ అలి మాట్లాడుతూ రక్తదానం అవసరం ఉన్న రోగులకు ఎంతో సహాయపడుతుందని తెలిపారు. ఇలాంటి శిబిరాల ద్వారా యువత రక్తదానంపై అవగాహన పెంచుకుంటారని చెప్పారు. మౌలానా ఆజాద్ ఆశయాలను స్మరించుకుంటూ, విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ మెగా రక్తదాన శిబిరం, జాతీయ విద్యా దినోత్సవానికి చక్కని అంకితంగా నిలిచారని ప్రిన్సిపల్ డాక్టర్ అబ్దుల్ ముక్సిత్ ఖాన్, కో-ఆర్డినేటర్ డాక్టర్ హకిముద్దిన్, కన్వీనర్ మొహమ్మద్ సికందర్ హుస్సేన్, ఎన్ఎస్ ఎస్ కో-ఆర్డినేటర్ ఒమర్ ఫరూక్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అష్రఫ్ రాజా, ఇమామ్ ఉల్ హక్, ఖాజా మొయినుద్దీన్, డాక్టర్ అబ్దుల్ ఖవ్వి, ఖాజా పీర్, షరీఫ్ అయజుద్దీన్,అక్బర్ అలీ, మస్తాన్, తౌసిఫ్, ఆల్కమ్, ఇలియాస్, ముక్తార్ విద్యార్థులు పాల్గొన్నారు.

దక్షిణ కొరియాలో వైవీయూ ఆచార్యుడి శాస్త్రీయ ఉపన్యాసాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

దక్షిణ కొరియాలోని బుసాన్‌లో యోగి వేమన విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర శాఖ ప్రొఫెసర్ కె.ఎస్.వి. కృష్ణారావు 'కేన్సర్ చికిత్సకు సస్టైనబుల్ నానో-పాలిమర్ మెటీరియల్స్‌లో కొత్త అవకాశాలు' అనే ఆహ్వాన ప్రసంగం చేశారు. దక్షిణ కొరియాలోని బుసాన్ 9వ ఆసియన్ సింపో జియం ఆన్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్‌కు ఆచారి కృష్ణారావును ఆహ్వా నించారు. తన ఉపన్యాసంలో 'ఊపిరితిత్తుల క్యాన్సర్ కోసం పోర్టబుల్ ఇన్హేలర్లలో స్మార్ట్ పాలిమెరిక్ నానోథెరపిటిక్స్' అనే అంశంపై శాస్త్రీయ ప్రసంగం చేశారు. చర్చల ఫలితం బయోమెటీరియల్స్, ఆహార ఉత్పత్తులను అభివృద్ధి చేయడం గురించి చర్చించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

నేతలను ప్రజలే మార్చాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కడప జిల్లాలో నేతలు లాభార్జనే ధ్యేయంగా మేతగాళ్లు మారి రాజకీయం చేస్తున్నారని, వారిని ప్రజలే మార్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం కామ్రేడ్ సుందరయ్య భవనంలో సిపిఎం మైదుకూరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. శివకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పాలక, ప్రతిపక్ష పార్టీల ముఖ్య నేతలే వర్గ సంక్రమ రాజకీయాలతో బడుగు, బలహీన వర్గాల భూములను కబ్జా చేస్తున్నారని పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా గ్రామీణ ధనిక పెత్తందారి వర్గాల దుర్మార్గాలను ప్రతిఘటిస్తూ గ్రామ, గ్రామానా ప్రతిఘటన పోరాటం ప్రారంభం కావాలన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా అంగన్వాడీలను, రేషన్ డీలర్లను, ఫీల్డ్ అసిస్టెంట్లను మారుస్తున్నారని, అధికారులను బదిలీలు చేస్తున్నారని ఇది అప్రజాస్వామిక చర్య అని పేర్కొన్నారు. జిల్లాలో రైతులకు ఎరువుల కొరత తీవ్రంగా ఉందని కంటి దులుపు చర్యలు చేపట్టి రైతుల గోడు పట్టించుకోలేదని ప్రశ్నించారు. పలు మున్సిపాలిటీలలో అనవసరంగా గ్రామపంచాయతీలను కలిపి అధికపన్నులు ఏడాదికి రెండు మార్లు వసూలు చేస్తున్నారని, అభివృద్ధి మాత్రం శూన్యమని వాపోయారు. మొంథా తుపాన్ వల్ల జిల్లాలో వరి, మొక్కజొన్న, మినుము, మిరప, ఉల్లి, పత్తి, అరటి పంటలు సుమారు రెండు వేల ఎకరాలు రైతుల పూర్తిగా నష్టపోయారన్నారు. మరో వెయ్యి ఎకరాలు పాక్షికంగా దెబ్బతినిందని, ఇప్పటివరకు వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు, హార్టికల్చర్ అధికారులు సరైన అంచనాకు రాలేదని వెంటనే రైతులను కలిసి పంట నష్టం అంచనా వేసి వారికి నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాలలో ఉన్న పాలక, ప్రతిపక్షల నాయకులు ఒద్దికగా భూమిలేని గ్రామీణ నిరుపేద రైతులకు అందాల్సిన ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేసుకుంటున్నారని, ఇది ప్రజలు గమనిస్తున్నారని, ప్రభుత్వ భూములు ప్రజలకు పంచేవరకు సిపిఎం పోరాడుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.అన్వేష్ , బ్రహ్మంగారి మఠం మండల కార్యదర్శి జి.సునీల్ కుమార్, సిపిఎం శాఖ కార్యదర్శులు, సభ్యులు హాజరయ్యారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న ప్రతిపక్షం

- టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ జీర్ణించుకోలేక ప్రతిపక్ష వైసిపి విషయం చిమ్ముతుందని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి విమర్శి ంచారు. సోమవారం ద్వారకా నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వైసిపి అధికారంలో ఉన్నప్పుడు లిక్కర్, ఇసుక, మట్టి మాఫియాకు పాల్పడి 11 సీట్లకు పరిమితమైందని తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సుపరిపాలన కొనసాగిస్తుందని చెప్పారు. ఇప్పుడిప్పుడే అప్పుల నుంచి రాష్ట్రం బయటపడుతూ ఉందని పేర్కొన్నారు. గూగుల్ డేటా సెంటర్, రిఫైనరీ పెట్టుబడులు, విశాఖలో మిట్టల్ ఉక్కు పరిశ్రమ, సిఐఎ సదస్సులో పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక హక్కుగా రూపు దిద్దుతున్నారని చెప్పారు. పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. కృష్ణా జలాలను తమిళనాడు వరకు తీసుకువెళ తున్నామని తెలిపారు. 2027 నాటికి పోలవరం పూర్తవుతుందని చెప్పారు. మొంథా తుఫాను నష్టాన్ని టెక్నాలజీ ద్వారా నివారించగలిగామని తెలిపారు. ఎన్నికలను వైసిపి తన పార్టీ ఎన్నికలుగా మార్చేసిందని విమర్శి ంచారు. ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసిన జగన్‌కు బుద్ధి రాలేదని చెప్పారు. చంద్రబాబు నాయుడు హైదరాబాదు నుంచి పాలన చేస్తున్నారని గతంలో గగ్గోలు పెట్టిన జగన్ ఇప్పుడు ఏ రాష్ట్రంలో ఉన్నారని ప్రశ్నించారు. జగన్ ఆత్మావలోకన చేసుకోవాలని హితవు పలికారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ పనులు కొనసాగుతూ ఉన్నాయని పేర్కొన్నారు. ప్రాజెక్టులలో సమృద్ధిగా నీళ్ల ఉన్నాయని తెలిపారు. పారిశ్రామికవేత్తలను భయభ్రాంతులకు గురిచేసి ఎపి బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయెుద్దని హితవుపలికారు. అవినీతిలో పుట్టిన పార్టీ వైసిపి అని విమర్శించారు.

మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

ఉపాధ్యాయుడికి మంత్రి ప్రశంసలు

ప్రజాశక్తి - కలసపాడు

మండలంలోని కరణం వారి పల్లె పాఠశాల ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత గానుగపెంట రమణారెడ్డిని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మాట్లా డుతూ తాను పాఠశాలలో పని చేస్తున్నప్పుడు ముగ్గురు విద్యార్థులున్నారని, ప్రస్తుతం వారి సంఖ్యను 26 మందికి చేర్చానని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో గుర్తించి తనను మంత్రి అభినందించారని చెప్పారు.



రమణారెడ్డి

రెండవ ఎఎన్ఎంల

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా వ్యాప్తంగా రెండవ ఎఎన్ఎంలు చాలా ఏళ్లుగా వైద్య, ఆరోగ్యశాఖలో సేవలందింస్తున్నారని, వీరు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శి మనోహర్, యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.వి నారాయణమ్మ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోవిడ్ కాలంలోనూ క్షేత్రస్థాయిలో రెండవ ఎఎన్ఎంలు సేవలందించారని తెలిపారు. పని సర్దుబాటు పేరుతో అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న రెండవ ఎఎన్ఎంలను సదూర ప్రాంతాలకు, ప్రస్తుతం నూతనంగా ఏర్పడిన వేరే జిల్లాలకు బదిలీచేశారని చెప్పారు. దీని వల్ల దాదాపు మూడేళ్ల ఆర్థికంగానే కాక మానసికంగాను రెండవ ఎఎన్ఎంలు ఇబ్బందులు పడుతు న్నారని వాపోయారు. కుటుంబాలకు దూరంగా బతుకుతున్నారని పేర్కొన్నారు. వీరి పరిస్థితిని మానవతాదృష్టితో పరిశీలించి ప్రాంతాలకు తిరిగి పంపించాలని కోరారు. గతంలో మాదిరిగా యూనిఫామ్, యూనిఫామ్ అలవెన్సు చెల్లించాలని చెప్పారు. సెకండ్ ఎఎన్ఎంలు చేస్తున్న వివిధ పనులకు సంబంధించిన ఇన్సెం టివ్ వారికే చెల్లించాలని పేర్కొన్నారు. గతంలో నెలకు 2 వేలు చెల్లించేవారని తెలిపారు. ఎంటిఎస్‌ను అమలు చెయాలని చెప్పారు. ఈ లోగా జిఒ నంబరు 60లో ఇచ్చిన విధంగా రూ.27 వేల వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో చెన్నమ్మ, సుజాత లక్ష్మీ, జ్యోతి లలితా, గౌరి పాల్గొన్నారు.

గంగ పేరూరు దళితవాడకు తాగునీరివ్వాలి

ప్రజాశక్తి - ఒంటిమిట్ట : గంగపేరూరు దళితవాడకు తాగునీరందించాలని సిపిఎం మండల కార్యదర్శి కె. నరసయ్య పేర్కొన్నారు. సోమవారం కాలనీవాసులతో కలిసి ఎంపిడిఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మాట్లాడుతూ గంగపేరూరు గ్రామానికి గతంలో పలుమార్లు పాలకవర్గాల నాయకులు గ్రామానికి నీళ్లు ఇస్తామని హామీలు ఇచ్చి పట్టించుకోలేదని వాపోయారు. ఆ గ్రామానికి పక్కనే పెన్నానది పైపులైను ఉన్నా కాలనీకి తాగునీరివ్వకపోవడం అన్యాయం అన్నారు. ఇప్పుడైనా అధికార యంత్రాంగం గంగా పేరూరు ఎస్‌సి కాలనీకి పెన్నానది పైప్ లైన్ వేసి తాగు నీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మరి యమ్మ, జయమ్మ, ఆదిలక్షుమ్మ, వెంకట నరసయ్య, నాగరాజు దస్తగిరి పాల్గొన్నారు.

వైద్య విద్యకు చంద్ర గ్రహణం : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప: రాష్ట్రంలోని ప్రయివేట్, అన్ ఎయిడెడ్, ప్రొఫెషనల్, వైద్య, దంత కళాశాలలోని కోర్సులకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఫీజులను పెంచి, వైద్యవిద్యకు పేద విద్యార్థులను దూరం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ విమర్శించారు. కడపలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని వైద్య విద్యకు పూర్తిగా చంద్రగ్రహణం పట్టినట్లు ఎద్దేవా చేశారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంగా జబ్బులు చరచుకునే ఈ ట్రబుల్ ఇంజిన్ ప్రభుత్వం విద్యను పూర్తిగా వ్యాపార పరం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రయివేట్, అన్ ఎయిడెడ్, ప్రొఫెషనల్, వైద్య, దంత కళాశాలల్లోని యూజీ కోర్సులకు 10 శాతం ఫీజులను అమాంతంగా పెంచి వేశారన్నారు.

మంత్రి సవితమ్మకు వినతిపత్రమిస్తున్న పేర్ల పార్థసారథిరెడ్డి

సమస్యల్ని పరిష్కరించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - వేముల

పులివెందుల నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పేర్ల పార్థసారథిరెడ్డి బిసి సంక్షేమశాఖ మంత్రి సవితమ్మను కోరారు. ఆ మేరకు ఆయన విజయవాడలో మంత్రికి వినతిపత్రమిచ్చారు. వేముల మండలంలోని ముస్లింల చిరకాల ఆకాంక్ష షాదీఖానా నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను తొందరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

పాఠశాల ఆవరణలో వర్షపునీరు నిల్వ లేకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని జడ్‌పి సిఇఒ ఓబులమ్మ ఆదేశించారు. కొత్తపల్లి గ్రామంలో సోమవారం సిఇఒ, జమ్మలమడుగు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రామాంజనేయులు పర్యటించారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సిఇఒ దృష్టికి తెచ్చారు. సిఇఒ మాట్లాడుతూ నీరు నిల్వ లేకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపిడిఒ రాధాకృష్ణవేణికి సూచించారు. ప్రతి రోజు ఇంటింటికి తిరిగి చెత్త సేకరించాలని క్లాప్ మిత్రలను ఆదేశించారు. ఎస్‌సి కాలనీలో నిలిచిపోయిన మురికి నీటిని జెసిబి సాయంతో బయటికి తరలించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఇఒ హెచ్చరించారు. డిప్యూటీ ఎంపిడిఒ వీర భద్రుడు, పంచాయితీ కార్యదర్శి సౌభాగ్యలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారులతో మాట్లాడుతున్న టిపిఒ వెంకటరమణారెడ్డి

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల కూడలిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటున్నామని టిపిఒ వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో బస్టాండుకు ఇరువైపులా సోమవారం టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా చిరు వ్యాపారులు లోపలికి సర్దుకోవాలని, రోడ్డుపై తోపుడు బండ్లు పెట్టరాదని సూచించారు. రోడ్డుపై ఉన్న వాటిని తొలగించేందుకు ఒక్కరోజు గడువు ఇచ్చారు. అనంతరం టిపిఒ మాట్లాడుతూ కూడలిలో ట్రాఫిక్ ప్రధాన సమస్యగా ఉందన్నారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా వంద అడుగుల రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఆ రోడ్డు మంజూరైతే సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసు కుంటామన్నారు. తోపుడుబండ్ల వ్యాపారులు, పూల వ్యాపారులు, టిఫిన్ బండ్ల వ్యాపారులకు ముందుగా సమాచారమిచ్చామన్నారు. అయినా వారు స్పందించలేదన్నారు. మున్సిపల్ సర్వేయర్ నాగరాజు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌ఛార్జి ప్రదీప్, ప్లానింగ్ సెక్రటరీలు ఉషారాణి, నగేష్, సుబ్బారెడ్డి, ప్రదీప్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ కేంద్ర ప్రారంభంలో డిపిఎం వసంతకుమారి

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - చక్రాయపేట

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని అడిషనల్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వసంతకుమారి పేర్కొన్నారు. చక్రాయపేటలో సోమవారం జాతీయ ప్రకృతి వ్యవసాయ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి కేంద్రం ప్రారంభం కావడంతో ముఖ్య అతిథిగా వసంతకుమారి, ఎఒ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కేంద్రాన్ని భ్రమరాంబ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వసంతకుమారి మాట్లాడుతూ కషాయాలు, జిగురు అట్టలు, లింగాకర్షణ బుట్టలు, పిఎండిఎస్ కిట్స్ వ్యవసాయానికి వాడడం వల్ల మంచి దిగుబడి వస్తుందన్నారు. పంట మంచి దిగుబడి వస్తే రైతు కష్టానికి ఫలితం దక్కినట్లు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ శ్రీనాథ్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్ ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - దువ్వూరు

అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, 1098 హెల్ప్‌లైన్, సైబర్ నేరాలు తదితర అంశాలపై జడ్పీ హైస్కూల్ దువ్వూరు, పుల్లారెడ్డిపేట, మాచనపల్లి, చల్ల బసాయపల్లిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలు పూర్ణిమ, కవిత, నాగ నవీన, కావ్యశ్రీకి చాపాడు సిడిపిఒ ముంతాజ్ బేగం, సూపర్వైజర్ వరలక్ష్మి, సోషల్ వర్కర్ విజయకుమారి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఐసిడిఎస్ అధికారులు

జౌకులతో భూములు నిస్సారం

సమస్యను పరిష్కరించాలని అహోబిలం రైతులు జెసికి వినతి

జెసికి సమస్యను వివరిస్తున్న అహోబిలం రైతులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని అహోబిలం పొలాల్లో నీరు నిల్వ ఉండడంతో అవి నిస్సారంగా వ్యవసాయానికి పనికిరావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అహోబిలం గ్రామానికి చెందిన దాదాపు 30 మంది రైతుల 150 ఎకరాల్లో పైడిపాలెం రిజర్వాయర్ పూర్తి సామర్థ్యంలో నీటి నిల్వ కారణంగా వ్యవసాయ యోగ్యవంతమైన భూములు జౌకులతో పంట సాగుకు అనుకూలంగా లేవు. చీని, అరటితోపాటు మెట్ట పొలాల్లో సైతం నీరు ఉండడంతో వ్యవసాయం చేయడం ఇబ్బందిగా మారిందని రైతులు వాపోతున్నారు. పైడిపాలెం రిజర్వాయర్ వలన అనేకమంది రైతులకు ఉపయోగం ఉన్నప్పటికీ రిజర్వాయర్ దిగువన ఉన్న తమ గ్రామంలో చాలామంది రైతులు భూముల్లో పంటలు సాగు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పైడిపాలెం రిజర్వాయర్ కారణంగా భూములు వ్యవసాయానికి ఉపయోగపడటం లేదని అహోబిలం రైతులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జెసికి దృష్టికి తీసుకెళ్లారు. వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. తమ భూములు వ్యవసాయ చేయడానికి వీలు కావడం లేదన్నారు. రిజర్వాయర్ నీరు లీకేజీలను(జౌకులు) శాశ్వతంగా నివారించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధిత రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు.

చీనీ తోటలో నిలిచిన నీరు

వలసపల్లెలో మట్టి మిద్దె కూలి మహిళ మృతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని వలసపల్లె గ్రామంలో సోమవారం మట్టి మిద్దె కూలి అందులో నిద్రిస్తున్న నలబల్లె వీరమ్మ(60) మృతి చెందింది. సోమవారం తెల్లవారుజామున మూడు గంటలకు మట్టి మిద్దె పైకప్పు కూలింది. మట్టి మీద పడడంతో ఆమె అందలో కూరుకుపోయింది. ఉదయం 7 గంటల సమయంలో ఆమె కోడలు లేపేందుకు తలుపు వద్దకు వెళ్లగా ప్రమాదాన్ని గుర్తించి, స్థానికులకు తెలిపింది. స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటికి తీశారు. పోలీసులకు సమాచారం తెలియడంతో సిఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ నాగమురళి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సిమెంటు పరిశ్రమ బ్లాస్టింగ్‌తో ఇళ్లు కదిలి కూలిపోతున్నాయని స్థానికులు సిఐ దృష్టికి తెచ్చారు. మృతదేహంతో పరిశ్రమ వద్ద ధర్నా నిర్వహిస్తామని పట్టుబట్టారు. విషయం పరిశ్రమ యాజమాన్యానికి తెలియడంతో జువారి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ నాగమల్లేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పెద్ద ఎత్తున గ్రామస్తులు చేరుకుని సమస్యను అధికారులకు వివరించారు. చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్, సిఐ విశ్వనాథరెడ్డి సమస్యను జువారి జిఎం కృష్ణమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కేసు నమోదు చేసి వీరమ్మ మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. **గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు..** వలసపల్లె గ్రామానికి సమీపంలో జువారి సిమెంట్ పరిశ్రమ ఉంది. పరిశ్రమకు సంబంధించి సున్నపురాయి మైనింగ్ గ్రామానికి అతి సమీపంలో ఉంది. సున్నపురాయి కోసం అక్కడ బ్లాస్టింగ్ చేస్తే గ్రామంలో ఇళ్లు అదురుతున్నాయని, గోడలు బీటలుబారుతున్నాయని తెలిపారు. ఇళ్లల్లోని వస్తువులు కూడా కిందపడుతున్నాయిన తెలిపారు. వలసపల్లెలో దెబ్బతిన్న గోడల వల్ల మట్టి మిద్దెలు కూలిపోతున్నాయని, ఊరిలో ఇప్పటివరకు నాలుగు మిద్దెలు కూలిపోయాయని స్థానికులు వాపో తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశామని, కంటి తుడుపుగా వారు వచ్చి చూసి పోవడం తప్ప చేసింది ఏమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మట్టిలో కూరుకుపోయిన వీరమ్మ మృతదేహం(ఇన్‌సెట్) వీరమ్మ (ఫైల్‌ఫొటో)

సమస్యను సిఐ విశ్వనాథ్‌రెడ్డికి వివరిస్తున్న వలసపల్లె వాసులు

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలి

వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు కేంద్రంగా ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలకు అక్ర మంగా రేషన్ బియ్యం తరలింపును అరికట్టాని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమ వారం తహశీల్దార్ శ్రీనివాసులరెడ్డికి వినతిపత్ర మిచ్చారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం పేదలకు రేషన్ బియ్యం ఇస్తుంటే, కొందరు ఆ రేషన్ బియ్యాన్ని అక్ర మంగా ఇతర రాష్ట్రాలకు రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ముఖ్యంగా రైస్ మిల్లుల కేంద్రంగా ఇదంతా జరుగుతున్నట్లు ప్రజల నుంచి ఆరోపణలున్నాయన్నారు. జమ్మలమడుగు చుట్టుపక్కల గ్రామాల నుండి రేషన్ బియ్యాన్ని ప్రజల వద్ద సేకరించి ఆటోల ద్వారా రైస్ మిల్లులకు చేర్చి బియ్యం మాటున రేషన్ బియ్యం చేర్చి లారీల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. రేషన్ మాఫియా ప్రొద్దుటూరులో అధికారులపైననే దాడులు చేసే స్థాయికి వెళ్లిపోయిందన్నారు. రైస్ మిల్లులను తనిఖీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య, పట్టణ నాయకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు అభివృద్ధికి ఆ నలుగురే అడ్డంకి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు అభివృద్ధికి ఆ నలుగురు అడ్డంకిగా మారారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్‌బాషా తీవ్రంగా విమర్శించారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొద్దిరోజులుగా పరస్పర ఆరోపణలు ఎక్కువయ్యాయని తెలిపారు. 40ఏళ్లుగా ఇద్దరు నాయకులు ఎమ్మెల్యేలయ్యారన్నారు. అయినా పట్టణంలో మౌలిక సదుపాయాలు కరువయ్యాయని విమర్శించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కేటాయించిన నిధులు వెనక్కి వెళ్లిపోయాయని, జగన్ హయాంలో కూడా అభివృద్ధి ఆగిపోయిందని పేర్కొన్నారు. పట్టణంలో అవినీతి, అసాంఘిక కార్యకలాపాలు పెరగడం ఆందోళన కలిగించే అంశమన్నారు. పోలీసులు ప్రజల కోసం పనిచేయాలే తప్ప, నాయకుల కోసం కాదన్నారు. వైసిపి హయాంలో నిర్వహించిన మున్సిపల్ ఎగ్జిబిషన్ బకాయిలు ఇప్పటికీ మున్సిపాలిటీకి చెల్లించాల్సి ఉందన్నారు. దీనిపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. వ్యక్తిగత లావాదేవీలపై రాజకీయాలు చేయడం సరికాదన్నారు.

మాట్లాడుతున్న ఇర్ఫాన్‌బాషా

ప్రజా ఉద్యమం గోడ పత్రికలను అవిష్కరిస్తున్న వైసిపి నేతలు

ప్రజా ఉద్యమ ర్యాలీని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేస్తున్నందుకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన ప్రజా ఉద్యమం ర్యాలీని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్ గౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నిసార్ బాషా పిలుపునిచ్చారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం ప్రజా ఉద్యమం గోడ పత్రికలను అవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపుమేరకు పులివెందులలో ఈనెల 12న వైద్య కళాశాలలు ప్రయివేటీకరణను ఆపాలంటూ ర్యాలీ చేపట్టామన్నారు. ఉదయం 9 గంటలకు పులివెందులలోని పాత ఎమ్మెల్యే కార్యాలయం నుండి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని వారు కోరారు. కార్యక్రమంలో వైసిపి నేతలు షేక్షావలి, భారతి, కమతం రాజా, నేర్జంపల్లె సుధాకర్, పద్మా రాజ్‌కుమార్, ముత్యాల ఆంజనేయులు, గణేష్, హబీబుల్లా, మటన్ బాబా, షామీర్, మణి గోపాల్ రెడ్డి, కటిక చంద్రశేఖర్ పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఈనెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు రామేశ్వరం గ్రంథాలయ అధికారి ఉమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 14న తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపట ఆవిష్కరణ, 15న పుస్తక ప్రదర్శన, 16న వ్యాసరచన పోటీలు, 17న చిత్రలేఖనం పోటీలు, 18న సెమినార్‌తోపాటు పలు కార్యక్రమాలు ఉంటాయన్నారు. 19న ఇందిరాగాంధీ చిత్రపటావిష్కరణ, 20న బహుమతి ప్రదానంతో వారోత్సవాలు ముగుస్తాయన్నారు. ఇందులో పాల్గొనదలచిన వారు 7075351711కు ఫోన్ చేయాలని ఆమె సూచించారు.

అవార్డు అందుకుంటున్న సుజన్‌కుమార్

సుజన్‌కుమార్‌కు జాదురత్న అవార్డు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఆంధ్రప్రదేశ్ మెజీషియన్స్ అసోసియేషన్ రాజంపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 41వ మేజిక్ ఫెస్టివల్లో తనకు జాదురత్న అవార్డు ఇచ్చినట్లు దరియా సుజన్‌కుమార్ తెలిపారు. ఈ అవార్డును ఇంద్రజాల ప్రముఖులు మేజిక్ స్టార్ డాక్టర్ బోసు, ఏపీఎంఏ ప్రెసిడెంట్ జేవిఆర్, సెక్రటరీ యూపీ రాయుడు అందజేశారని ఆయన తెలిపారు. 27ఏళ్ల అనుభవం తనకు ఉందన్నారు. 17 రాష్ట్రాల్లో రెండువేల ఇంద్రజాల ప్రదర్శనలు ఇచ్చినట్లు తెలిపారు. 23ఏళ్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వరిస్తున్నానని తెలిపారు. తనను గుర్తించి ఈ అవార్డును అంద జేసినందుకు ఏపీఎంఏకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని సుజన్‌కుమార్ పేర్కొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రం మార్పు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురంలో ఉన్న విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాన్ని మార్చినట్లు ఆ శాఖ ఎఇ దినేష్ కుమార్ తెలిపారు. గతంలో బస్టాండ్ సమీపంలో ఉన్న బిల్లుల చెల్లింపు కేంద్రాన్ని సబ్‌స్టేషన్ ప్రాంగణంలో ఉన్న నూతన భవనంలో ఏర్పాటు చేశామన్నారు. ఈ మార్పును గమనించి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మాట్లాడుతున్న ఆప్కాస్ గౌరవాధ్యక్షులు వినయ్‌కుమార్

సెక్యూరిటీ గార్డ్స్‌కు పెంచిన వేతనాలివ్వాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్‌కు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు ఇవ్వాలని ఆప్కాస్ గౌరవ అధ్యక్షులు ఎ.వినయ్‌కుమార్ కోరారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గడిచిన మూడు నెలలుగా వారికి జీతాలు రావడం లేదన్నారు. సెక్యూరిటీ గాడ్స్‌కు, శానిటేషన్ వర్కర్లకు కొత్త అగ్రిమెంట్ ప్రకారం రూ.18,600 ఇవ్వాల్సి ఉందన్నారు. వీరికి కేవలం రూ.7000 నుంచి రూ.8000 మధ్యలో మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. జీతాలు రాక వారికి కుటుంబ పోషణకు భారమైందన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాములేటి, చంటి పాల్గొన్నారు.

అధ్వానంగా ఉన్న సర్వాయపల్లె రోడ్డు

మురికికూపంగా సర్వాయపల్లె రోడ్డు

ప్రజాశక్తి - మైదుకూరు టౌన్

మైదుకూరు మున్సిపాలిటీ 11 వార్డు సర్వాయపల్లె రోడ్డు మురికికూపాన్ని తలపిస్తోంది. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాలను మున్సిపల్ సిబ్బంది పనిచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అపరిశుభ్రంగా ఉండడంతో పందులు, దుర్వాసనతో స్థానికులు అల్లాడిపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయ ఆవరణలో వీరభద్రస్వామి ఊరేగింపు

అల్లాడుపల్లెలో అన్నదానం

ప్రజాశక్తి - చాపాడు

మూడవ కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవస్థాన ఆవరణలో పలుచోట్ల భారీగా అన్నదానాలు ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ పెరుగు వీర నారాయణ యాదవ్, ఇఒ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజాము నుంచి వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు వీరభద్ర స్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తులకు ఘనంగా పల్లకి సేవ, ఊరేగింపు నిర్వహించారు. భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రం, ఆర్య వైశ్య, సర్వజన, విశ్వ బ్రాహ్మణ అన్నదాన సత్రాల్లో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వీరారెడ్డి, ఓం మహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నం వడ్డిస్తున్న సర్పంచ్ పెద్దిరెడ్డి, గ్రామ పెద్దలు

భక్తులకు అన్న ప్రసాద వితరణ

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పుల్లూరు సమీపాన ఉన్న నాగ నాథేశ్వర కోనలో కార్తికమాసం మూడవ సోమవారం సందర్భంగా ఆంజనేయ కొట్టాలు గ్రామస్తుల సహకారంతో అన్నప్రసాద వితరణ చేశారు. సర్పంచ్, గ్రామ పెద్దల సహకారంతో నిర్వహించారు. సర్పంచ్ గోపిరెడ్డి పెద్దిరెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దాతలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కాశినాయన ఆశ్రమం వద్ద మండలంలోని పాల వ్యాపారస్తుల సహకారంతో అన్నదానం చేశారు.

మండలాభివృద్ధికి కృషి చేస్తా

బాధ్యతలు చేపట్టిన ఎంపిడిఒ శివారెడ్డి

ప్రజాశక్తి - చక్రాయపేట

చక్రాయపేట మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపిడిఒ కె.శివారెడ్డి పేర్కొన్నారు. చక్రాయపేట ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఆయన మండలాభివృద్ధి అధికారిగా సిఇఒ ఆదేశాల మేరకు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో జమ్మలమడుగు ఎంపిడిఒ శివారెడ్డిని చక్రాయపేటకు సిఇఒ పంపారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉందని, సిఇఒ దృష్టికి తీసుకెళతానని తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రికెట్‌కు ఐడిపిఎస్ విద్యార్థి చార్వి

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 6వ తరగతి విద్యార్థిని మోతుకూరు చార్విరెడ్డి స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్‌సెలక్షన్స్‌లో అండర్-17 రాష్ట్రస్థాయి ఆల్‌రౌండర్‌గా ఎంపికైనట్లు చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ అంటే మన దేశంలో ఉన్న క్రేజ్ ఎంతో గొప్పదన్నారు. ఈ నేపథ్యంలో ఐడిపిఎస్‌కు చెందిన అమ్మాయి రాష్ట్రస్థాయికి ఎంపికవడం చాలా సంతోషానిచ్చిందన్నారు. భవిష్యత్తులో పాఠశాల విద్యార్థిని చార్విరెడ్డి కూడా భారతదేశ క్రికెట్ రంగానికి సారథ్యం వహించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల డైరెక్టర్ వి.లోహిత్ రెడ్డి, ప్రిన్సిపల్ బి.రవీంద్రకుమార్ చార్వికి శుభాకాంక్షలు అందజేశారు.